

# బల్లచెక్క


డి. కామేశ్వరి

కోటేశ్వరరావు కోటికి పడగెత్తిన వాడు. ఆయనకి అందమైన భార్య వుంది, ఆరు ఫ్యాక్టరీలున్నాయి, ఆరు భవంతులున్నాయి, ఆరు కంపెనీలలో షేర్లున్నాయి, ఆరు బ్యాంకుల్లో ఎకౌంట్లున్నాయి, అరవై లక్షలున్నాయి,ఆరు కార్లు, అరవైమంది నౌకర్లు, ఆరువేల మంది పనివాళ్ళు ఆయన చేతి కింద వున్నారు. ఆయనింట్లో ఆరు ఎయిర్ కండషన్డు బెడ్‌రూములు, ఆరు రంగుల ఫోన్లు, ఆరు టెలివిజన్లు, ఆరు టేపు రికార్డర్లు....ఆరు రకాల సోఫా సెట్లు యిలా చెప్పాలంటే, ఎన్నో వున్నాయి ఆయనకి....యిన్ని వున్నాయనకి,యిన్ని రకాల ఆస్థినంతటినీ అనుభవించటానికి వారసుడు లేడు. కనీసం ఓ కూతురయినా లేదు. నలభై అయిదేళ్ళ కోటేశ్వరరావు, ముప్పై ఐదేళ్ళ విమలాదేవి పదిహేనేళ్ళనించీ చూడని డాక్టరులేడు, దర్శించని దేముడులేడు. డాక్టర్లు ఏం లోపంలేదు పొమ్మన్నారు. దేముడు చుట్టూ ఎంత తిరిగినా యింకా టైము రాలేదన్నట్టు మౌనం వహించి, ఆఖరికి యిన్నిసార్లు తిరిగారు, యిన్ని ముడుపులు కట్టారు. పోనీలే పాపం అన్నట్టు ఆఖరికి ఓ వంశాంకురాన్ని ప్రసాదిం

చాడు. ఆ సంబరాన్ని, ఆ సంతోషాన్ని ఆ వేడుకని ఓ యాభై వేలు మాత్రం ఖర్చుపెట్టి నలుగురికీ గర్వంగా చాటు కున్నారు ఆ దంపతులు.

ఆ వంశోద్ధారకుడు ఆ ఏకైక వార సుడు, ఆ ముద్దులు మూటకట్టే బాబుకి పాలు పట్టేందుకు ఓ నర్సు, స్నానానికి మరో ఆయా, ఆడించటానికి ఓ నర్సు, గుడ్డలుతకటానికో పనిమనిషి, షికారు తిప్పటానికో ఆయా, గుర్రమవడానికో నౌకరు - యిలా అరడజను మంది నౌకర్లు బాబుని కింద కాలు పెట్టకుండా చేతుల మీద పెంచుతున్నారు. బాబు నోరిప్పి ఏడవకుండా అరడజనుమంది హాజరు. ముద్దులు మూటకట్టే ఆ బాబుని చూసి ముద్దులు ఆడుతూ పరవశిస్తారు ఆ తల్లితండ్రులు. ఆ కొడుక్కి, అపు రూపంగా పుట్టిన ఆ ఏకైక బిడ్డకోసం ఏం చెయ్యనా, యింకేంచేసి ఈ ఆస్తిని పదింతలు చెయ్యనా, యింకెన్ని షేర్లు కొననా, యింకెన్ని ఫాక్టరీలు కట్టించనా, ఏంచేసి తన పితృప్రేమ నిరూపించు కోనా, అందరు తండ్రుల్లాకాక తన ప్రత్యేకత ఏంచేసి నిరూపించుకోనా అని మధనపడి పడి షాజహాను తాజ్‌మహల్ కట్టి ముంతాజ్‌మీద ప్రేమ నిరూపించు కున్నట్టు కొడుక్కోసం అతి ప్రత్యేక మైన అపురూపమైన భవంతి కట్టించా లని నిర్ణయించాడు.

ఆరుగురు ఆర్కిటెక్చర్స్ అరవై ప్లాన్లు గీశాక అరవై ఒకటో ప్లాను అంగీ కరించి అత్యాధునికంగా, అద్భుతంగా, అందంగా పాతిక లక్షలతో భవన నిర్మాణం ఆరంభించాడు. కొడుకు కూర్చోటానికో గది, పడుకోటానికో గది డ్రస్సింగుకో గది, డైనింగుకో గది, రీడింగుకో గది, మూజిక్కో గది, తాగుడుకో గది, డాన్సుకో గది, ఆడు కోటానికో హాలు, స్విమ్మింగ్ పూల్- యిన్ని గదులకీ కొడుకు నాలుగడుగులు నడవకుండా అన్నింటికీ ఎటాచ్ బాత్ రూములు, కాలుకదపకుండా కూర్చున్న చోట మీట నొక్కితే తలుపులు మూసు కుంటాయి, మీట నొక్కితే మ్యూజిక్కు, మరో మీటనొక్కితే బారు ఎదుట హాజరు, ఇంకో మీట నొక్కితే పరదాలు తీసు కుంటాయి, మరో మీట నొక్కితే లైట్లా రిపోయేట్లు - కాలుకదపకుండా, పెదివి విప్పకుండా ప్రతి గదిలో కూర్చొన్న చోటల్లా మీటలు ఏర్పాటు చేయించాడు. ఇంటికో కంట్రాక్టరు, లైట్లకో కంట్రా క్టరు, శానిటరీ ఫిట్టింగ్స్‌కో కంట్రాక్టరు, ఫాన్సు సీలింగుకి ఒక కంట్రాక్టరు, మొజాయిక్ ఫ్లోరింగ్‌కో కంట్రాక్టరు, బారుకో కంట్రాక్టరు, ఇంటీరియర్ డెక రేషన్‌కో కంట్రాక్టరు - డజనుమంది కంట్రాక్టర్లు, అరవై మంది మేస్త్రీలు, అరవై మంది వడ్రంగి నిపుణులు, ఆరు వందలమంది కూలీలతో హుటాహుటీ ఆయనుంటున్న యింటిపక్క రెండెక




రాల స్థలంలో నిర్మాణం ప్రారంభమైంది- లారీలకొద్దీ సిమెంటు, ఇసక, లారీల కొద్దీ టేకుకలప, ఇటుకలు, ప్రత్యేకం నున్నగా చెక్కించిన కొండరాళ్ళు, మొజాయిక్ పాలరాళ్ళు - సిమెంటు మిషన్ నిర్విరామంగా పనిచేస్తూంది - టేకు దూలాలు తెగిపడుతున్నాయి. చూస్తూండగా రాత్రికి రాత్రి కుక్క-గొడుగు లేచినట్లు భవంతి లేవటం మొదలుపెట్టింది. మరో ఐదు నెలల్లో రాబోయే కొడుకు పుట్టినరోజు కనీవినీ ఎరుగనంత గ్రాండ్‌గా, ఎవరూ కనని ఆ భవంతిలో జరపాలని కోటేశ్వరరావు గారి కోరిక - రాత్రింబగళ్ళు పని చేయించి ఆవేళకి భవన నిర్మాణం పూర్తి అవాలని ఆయన ఆకాంక్ష. స్వయంగా రోజుకి రెండుసార్లు వెళ్ళి భవన నిర్మాణాన్ని పర్యవేక్షించి రావటం అలవాటయింది.

ఆరోజు రాత్రి పదిగంటల వరకు బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ మీటింగు, ఫ్యాక్టరీలో వర్కర్స్ చేయబోయే స్ట్రయికుని గురించిన సమాలోచనలు, ఇన్‌కంటాక్స్ కమీషనర్‌తో మీటింగు - వగైరా వగైరా ఊపిరి సలుపని పనులతో సతమతమయికూడా యిల్లు చేరగానే అలవాటుగా బిల్డింగు దగ్గరకు వెళ్ళారు. అప్పటివరకూ పెట్రొమాక్సు సాయంతో సీలింగ్ వేశారు. కాంక్రీటు పని మధ్యలో ఆపడం కుదరదు గనుక స్లాబింగ్ పూర్తియ్యాక పని ఆపి మేస్త్రీలు, కూలీలూ అప్పుడే యిళ్ళకు వెళ్ళారు. జరిగిన పని


చూసి సంతృప్తిగా తల ఆడించి వెను దిరగబోయిన కోటేశ్వరరావుగారు వెనక నించో, ఎడమనించో, కుడినించో ఎటు వించో చీకట్లోవినవచ్చిన రెండుగొంతులు గుర్తుపట్టి సర్పద్రష్టలా ఆగిపోయారు. ఆ గొంతులో ఆయన ఇల్లాలు, సతీమణి విమలాదేవిది — రెండోది ఆయన కార్ల కున్న అరడజను డ్రైవర్లలో ఒకడైన అమ్మగారి స్పెషల్ డ్రైవర్ జేమ్సుది. జేమ్స్ ఆంగ్లో యిండియన్ అయినా "ఆంగ్లో" కలర్ తో, ఆరడుగులతో అందంగా, హుందాగా వేసుకున్న తెల్ల యూనిఫాం కనక తీసేసి కోటేశ్వరరావు గారి సూటేసుకుంటే నల్లగా, పొట్టిగా, బట్టతలతో వుండే కోటేశ్వరరావే డ్రైవ రుగా, జేమ్సే యజమానిగా కనిపించే అందమైన కారు డ్రైవరు జేమ్సు. ఆ గొంతులు మాట్లాడుకొనే మాటలు వింటూంటే ఆయన మెదడుపనిచెయ్యటం మానేసి కేవలం చెవులుమాత్రం పని చేయసాగాయి.

"జేమ్స్, నీ కెన్నిసార్లు చెప్పినా ఎందుకు నాతో ఇలా ఆటలాడుతావు. నేనిలా రావటం, మనిద్దరిని ఈ స్థితిలో నా భర్త గనక చూస్తే నా గతి నీ గతి ఏమవుతాయో తెలియదా ?"

"అవును. నీ అవసరం తీరేవరకు మీ ఆయన చూస్తారన్న భయం లేక పోయింది పాపం. నన్ను కవ్వించి, రెచ్చగొట్టి, నీ అంతస్థుకి భయపడి దగ్గ రకి చేరడానికి సందేహించే నన్నుమచ్చిక చేసుకుని వల్లో వేసుకుని నీ అవసరం తీర్చుకోడానికి మీ ఆయన అడ్డురాలేదు అప్పుడు. వికటంగా నవ్వాడు జేమ్స్- "అవసరం తీరాక - చూడు. యిదిగో ఈ ఇల్లుచూడు - ఇది నిలబడాలంటే కాంక్రీటు స్లాబింగు కావాలి. ఆ స్లాబ్ నిలబడటానికి కింద రాట, పైన బల్ల చెక్కల సపోర్టు కావాలి. స్లాబ్ వేశాక బల్లచెక్క అవసరం తీరిపోయాక పీకి పారేస్తారు. నీవూ అంతే. నీ యిల్లు నిలబెట్టుకోడానికి నన్ను వాడుకున్నావు. నీ యిల్లు నిలబడింది. నీ అవసరం తీరి పోయింది. ఆ బల్లచెక్క మాదిరి పీకి పారేశావు దూరంగా" హేళనగా ఎత్తి పొడిచాడు.

"ఎందుకలా నిష్ఠూర మాడతావు. నీ కెప్పుడు కావలిస్తే అప్పుడు డబ్బు ఇస్తు న్నాను .... ఇదివరకులా వుండాలంటే ఎలా కుదురుతుంది....మా ఆయనికి తెలిస్తే...."

"హుం డబ్బు....అవును. డబ్బుమను ష్యులు మీరు. డబ్బు....అంతకంటే నీ నించి ఇంకా ఏదో ఆశించి పెర్రివెధవ నయ్యాను. బెంగపడకు....బల్లచెక్కకి యిల్లు నిలబెట్టటమే తెల్సు, కానీ కూల్చటం తెలయదు. నీ కోసం కాక పోయినా నా స్వార్థంకోసమన్నా నీ యిల్లు నిలుపుతాను". విసురుగా వెళ్ళిపోయాడు




జేమ్స్. ఆ వెనకే విమలాదేవి వెళ్ళింది.

కోటేశ్వరరావుగారి మెదడు మరో ఐదు నిమిషాలకిగాని పనిచెయ్యడం ఆరంభించలేదు. ఆరంభించాక ఆయన స్థితి వర్ణనాతీతం. బల్లచెక్క... బల్లచెక్క. హు....బల్లచెక్క. యిల్లు నిలబెడుతుంది.... బల్లచెక్క... బల్లచెక్కలతో ఆయన తలమోదినట్టు దిమ్మెరపోయింది ఆయన మెదడు....ఆ భవంతి నిలువునా ఆయన కళ్ళముందే మీదే కూలిపోయింది ....ఆషాక్ తట్టుకోవడం ఆయనవశంలో లేకపోయింది. కలలో మాదిరి తాగినవాడిలా, బాహ్యస్మృతి కోల్పోయి నిర్జీవంగా, నీరసంగా యింటివైపు నడిచాడు కోటేశ్వరరావు. బల్లచెక్క....హు.... బల్లచెక్క తనయిల్లు నిలబెట్టింది! అక్కరలేదు... తనకీ బల్లచెక్క అవసరంలేదు. ఇల్లూ అవసరంలేదు. పిచ్చివాడిలా గొణిగాడు ఆయన.

* * *

తెల్లవారేసరికి కోటేశ్వరరావుగారి ఆత్మహత్య వార్త పట్టణమంతా గుప్పుమంది. జీవితంమీద విరక్తితో ఆత్మహత్య చేసుకున్నట్టు ఆయన రాసిన ఉత్తరం చూశాక - లక్షలున్న కోటేశ్వరరావుకి ఆత్మహత్య చేసుకోవాల్సిన అవసరం ఏం వచ్చిందో, చుక్కలాంటి భార్య, ముత్యంలాంటి కొడుకు వున్న కోటేశ్వరరావుకి జీవితంమీద విరక్తి ఎందుకు పుట్టిందో అర్థంకాక ఊరంతా ఆశ్చర్యపోయింది.

అంతకంటే ఎక్కువగా, ఆయన యావదాస్థి, లక్షలు, ఫ్యాక్టరీలు, షేర్లు, ఇళ్ళు, కార్లు, నగలు, నాణ్యాలు,సమస్త ఆస్తి ఛారిటీకింద, ఆస్పత్రులకి, స్కూళ్ళకి అనాధాశ్రమాలకి, కుష్ఠురోగుల నిలయానికి, అనాధబిడ్డల చదువులకి, సత్రాలకి- రకరకాలుగా చెందేట్టు విల్లురాసి, కట్టుకున్న భార్యకి, అపురూపంగా పుట్టిన ఏకైక వంశోద్ధారకునికి దమ్మిడీ మిగల్చలేదని ఆయన రాసిన విల్లు తెలిశాక- ఊరంతా మరోసారి ఆశ్చర్యపోయింది.